

మా ధాన్యం ఎందుకు కొనరు?

- 15 రోజుల కింద కొనుగోలు కేంద్రం ఏర్పాటు
- అధికారులను నిలదీసిన రైతులు

6



అన్నాసాగర్ పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులను నిలదీస్తున్న రైతులు

మోగిన నగారా

మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు



- డిసెంబరు 11, 14, 17 తేదీల్లో పోలింగ్.. ఆరోజే ఫలితాలు
- రేపటి నుంచి నామినేషన్లు.. ప్రతీ విడతకు 3 రోజుల వ్యవధి
- ఉమ్మడి పాలమూరులో 1,678 గ్రామ పంచాయతీలు, 15,077 వార్డులు
- షెడ్యూల్‌కు ముందు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బిజీ

మహబూబ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చేసింది. బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు రద్దు కావడంతో 50 శాతం లోపు కల్పిస్తూ.. పార్టీపరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. అందులో భాగంగా రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేసి, కలెక్టర్లు సోమవారం గెజిట్‌లు విడుదల చేశారు. ఆ నివేదికను ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. దాంతో ఎన్నాళ్ల నుంచో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్న ఎస్ఈసీ మంగళవారం సాయంత్రం షెడ్యూల్‌ను విడుదల చేసింది. మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ 27 నుంచి ప్రారంభమవుతుంది. ఆ రోజు నుంచి కేవలం 21 రోజుల్లోనే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఆయా విడతల పోలింగ్ రోజే ఫలితాలను ప్రకటించి, ఉపసర్పంచులను ఎన్నుకుంటారు. ఇప్పటికే మంగళవారం ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందనే సంకేతాలతో

(మిగతా 6లో..)

ఉమ్మడి జిల్లాలో విడతల వారీగా ఎన్నికలు జరిగే మండలాల వివరాలు

విడత	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	గద్వాల	వనపర్తి	నారాయణపేట
1	గండీడ్, రాజాపూర్ మహమ్మదాబాద్ నవాబుపేట మహబూబ్‌నగర్	కల్వకుర్తి, వంగూరు ఉర్కొండ, వెల్దండ తాడూరు, తెల్కపల్లి	గద్వాల, ధరూర్, కేటీదొడ్డి గట్టు	ఖిల్లాగణపురం పెద్దమందడి రేవల్లి, ఏదుల గోపాల్‌పేట	మద్దూరు కోస్గి గుండుమాల్ కొత్తపల్లి
2	చిన్నచింతకుంట దేవరకద్ర కౌకుంట్ల, మిడ్జిల్ హన్వాడ కోయిల్‌కొండ	పెద్దకొత్తపల్లి కోడేరు, పెంట్లవల్లి కొల్లాపూర్ తిమ్మాజీపేట నాగర్‌కర్నూల్ బిజినేపల్లి	మల్దకల్ అయిజ రాజోలి వడ్డేపల్లి వనపర్తి	ఆత్మకూరు అమరచింత కొత్తకోట మదనాపూర్	నారాయణపేట దామరగిద్ద మరికల్ ధన్వాడ
3	అడ్డాకుల భూత్పూరు బాలానగర్ జడ్చర్ల మూసాపేట	చారకొండ, పదర బల్మూరు, లింగాల ఉప్పునుంతల అచ్చంపేట అమ్రాబాద్	ఎర్రవల్లి ఇటిక్యాల మానవపాడు అలంపూర్ ఉండవల్లి	పానగల్ వీపనగండ్ల చిన్నంబావి పెబ్బేరు శ్రీరంగాపూర్	మక్తల్ ఉట్కూరు నర్వ కృష్ణా మాగనూరు



గుడిమల్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

కూరగాయల్లేవ్!

- నారాయణపేట జిల్లాకు రోజుకు 150 మెట్రిక్ టన్నులు అవసరం
- ఉత్పత్తి అవుతున్నది 62 మెట్రిక్ టన్నులు మాత్రమే..
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- రైతులకు ప్రోత్సాహం కరువు
- 13 మండలాలకు ఇద్దరే హార్టికల్చర్ అధికారులు



నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పాతపల్లిలో సాగు చేసిన టమాటా తోట



నారాయణపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో అవసరం మేర ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయలు, పండ్లు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మూడు, నాలుగు మండలాలకు కలిపి ఒక ఉద్యాన శాఖ అధికారి ఉండటం, నూతన పద్ధతులపై అవగాహన లేక పాత పద్ధతిలోనే సాగు చేస్తుండటంతో ఉత్పత్తి పెరగడం లేదు. అధికారుల కొరత వల్ల అదనపు భారంతో క్షేత్ర స్థాయిలో పర్యటించలేక పోతున్నారు.

88 మెట్రిక్ టన్నులు కొరత

జిల్లాలో ఉన్న 5 లక్షల 60 వేల మంది జనాభాకు రోజుకు 150 మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం. కానీ, కేవలం 62 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాలో ఉత్పత్తి అవుతున్నాయి. మిగతా 88 మెట్రిక్ టన్నుల కూరగాయలను కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దాంతో ధరలు అధికమవుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది 1893.5 ఎకరాల్లో ఉల్లిగడ్డ, టమాట, వంకాయ, బీరకాయ, కాకర సాగు చేశారు.



మరికల్ మండలం తీలేర్ దగ్గర పండించిన కూరగాయలు విక్రయిస్తున్న రైతు కుర్మన్న

నలుగురు హెచ్‌ఈఓల కేటాయింపు

2020లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యాన శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేసిన 175 మంది హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారుల (హెచ్‌ఈఓ)ను అప్పటి ప్రభుత్వం తొలగించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 12న వారిని మళ్లీ నియమించింది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాలకు కేవలం ఇద్దరు హార్టికల్చర్ అధికారులే ఉన్నారు. తాజాగా నలుగురు హెచ్‌ఈఓ(హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారులు)లను కేటాయించారు. ముగ్గురు జాయిన్ కాగా, ఒకరు రావాల్సి ఉంది. ఒక జిల్లా హార్టికల్చర్, ఒక జిల్లా సెరికల్చర్ అధికారులు ఉన్నారు. వ్యవసాయ శాఖలో మండలానికో వ్యవసాయ అధికారి, క్లస్టర్ పరిధిలో ఏఈఓలను నియమించిన విధంగా మండలానికో ఉద్యాన శాఖ అధికారి, క్లస్టర్ల వారీగా హెచ్‌ఈఓలను నియమించాల్సిన అవసరం ఉంది.

విత్తనాల సబ్సిడీకి మంగళం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూరగాయల విత్తనాలకు ఇచ్చే 50 శాతం సబ్సిడీకి మంగళం పాడింది. దీంతో రైతులకు ప్రోత్సాహం కరువైంది. అయితే జీడిమెట్ల, ములుగులలో సబ్సిడీపై కూరగాయల నారు అందుబాటులో ఉన్నది. అక్కడ రూపాయికి ఒక మొక్క ఇస్తున్నారు. అందులో 90 పైసల సబ్సిడీ ఇస్తుండగా, రైతు పది పైసలు రైతు చెల్లించాలి. అక్కడి నుంచి తెచ్చుకోవాలంటే రవాణా ఇబ్బందులతో రైతులు నారు కొనుగోళ్లపై ఆసక్తి చూపడం లేదు. స్థానికంగా ఇవ్వాలని కోరుతున్నారు.

రూ.15 లక్షల సుపారీ?

- మాజీ సర్పంచ్ హత్య కేసులో కీలక మలుపులు
- వెలుగు చూస్తున్న సంచలన విషయాలు

7

13 ఏళ్ల బాలికకు 40 ఏళ్ల వ్యక్తితో పెళ్లి

- నిశ్చయించిన ఇరు కుటుంబాల పెద్దలు
- అడ్డుకున్న అధికారులు, సఖి కేంద్రానికి బాలిక

7



మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ జానకి

శాంతి భద్రతలకు విఘాతం కల్గించొద్దు: ఎస్పీ

గండీడ్/మహమ్మదాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు విఘాతం కల్గించొద్దని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ జానకి అన్నారు. మంగళవారం మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో అసత్య ప్రచారాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించ బోమని హెచ్చరించారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాల నివారణకు గ్రామాల్లో కమిటీల ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. మండలకేంద్రంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ముకర్లాబాద్ ధాన్యం కేంద్రం దగ్గర రైతులతో మాట్లాడి ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్‌రెడ్డి, వెంకటమ్మ పాల్గొన్నారు.

పీయూ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో పీయూ వీసీ శ్రీనివాస్ తదితరులు

- ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- వర్సిటీలో రూ.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఖేలో ఇండియా నుంచి నిధులు ఇప్పించాలని అధికారుల వినతి

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం పీయూలో రూ.75 కోట్లతో నిర్మించనున్న ఇంజనీరింగ్, లా కళాశాలలు, బాలికలు, బాలుర హాస్టల్ నిర్మాణాలకు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అరుణ మాట్లాడుతూ గత ఏడాది పీయూకు పీఎం ఉష(ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) పథకంలో భాగంగా రూ.100 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. ఆ నిధులతోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ప్రస్తుతం వర్సిటీలో 2 వేల మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా, అందులో దాదాపు 1,500లకు పైగా అమ్మాయిలు ఉన్నారన్నారు. పాలమూరు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థులు బాగా చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. వారికి ఇప్పుడు శంకుస్థాపన చేస్తున్న హాస్టల్స్ కాకుండా మరో మహిళా హాస్టల్స్ అవసరమని అన్నారు. ఖేలో ఇండియా నుంచి స్పోర్ట్స్‌కు ప్రత్యేక నిధులు కేంద్రం ద్వారా ఇప్పించాలని పీయూ అధికారులు ప్రతిపాదించారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో నిర్మించనున్న ఈ భవనాలు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని అందిస్తాయన్నారు. పాలమూరును విద్యా హబ్‌గా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గోనెల శ్రీనివాస్, మార్కెట్ చైర్‌పర్సన్ అనిత, పీయూ అధికారులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ ముంపు ప్యాకేజీ పెంపునకు

క్యాబినెట్ ఆమోదం

- ఫ్యామిలీ ప్యాకేజీ రూ.25 లక్షలు, సింగిల్ ఫ్యామిలీకి రూ.7.50 లక్షలకు పెంచాలని కోరా
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపువాసుల ప్యాకేజీ పెంపునకు క్యాబినెట్ ఆమోదించిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముంపునకు గురవుతున్న గ్రామాల వాసులకు ఫ్యామిలీ ప్యాకేజీని రూ.16.50 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని, అలాగే సింగిల్ ఫ్యామిలీకి రూ.6.50 లక్షల నుంచి రూ.7.50 లక్షలకు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరానని తెలిపారు. దీంతో రూ.146 కోట్ల రూపాయల పెంపునకు నిర్ణయం తీసుకున్నారని, క్యాబినెట్ ఆమోదం లభించిందని చెప్పారు. రానున్న మూడు, నాలుగు రోజులలో జీవో విడుదల అవుతుందని వివరించారు. పెంచిన ప్యాకేజీకి సంబంధించి ఎలాంటి లీగల్ సమస్య రాకుండా మూడు ఆప్షన్‌లను క్యాబినెట్‌లో పెట్టి చర్చించారన్నారు. వాటిలో ఏ ఆప్షన్ తీసుకున్నారో తెలుస్తుందన్నారు. ప్యాకేజీ పెంచాలని నిర్వాసితులు ఎప్పుడూ అడగలేదని, నిర్వాసితుల పక్షాన ప్రభుత్వంతో కొట్లాడి ప్యాకేజీ పెంచేలా చేశానన్నారు. రూ.146 కోట్ల పెంపు ఫిక్స్ అయ్యిందని, ఎంత రేటు పెరుగుతుందనేది త్వరలోనే తెలుస్తుందన్నారు. ప్యాకేజీ పెంచాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అడగలేదని, కేవలం రెండు పోలీస్‌స్టేషన్‌లు కావాలని అడిగాడని విమర్శించారు. ఇదిలా ఉంటే రూ.146 కోట్లను గ్రామాల అభివృద్ధికి అడిగి ఉంటే బాగుండేదంటూ మంత్రులు అన్నారని, అయినా కానీ ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం అయితే 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని చెప్పానని అన్నారు. ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు ఐదు తండావాసుల త్యాగం ఉందని, న్యాయం చేయాలని వివరించానని చెప్పారు.

ఇద్దరు డాక్టర్లకు

షోకాజు నోటీసులు

- ముగ్గురు సిబ్బంది సస్పెన్షన్
- ఒకరు ఉద్యోగంలోంచి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ధర్మాసుపత్రిలో కాసుల వేట అనే శీర్షికన జిల్లా జనరల్ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు డబ్బులు తీసుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 20న ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఘటనకు బాధ్యులైన ఇద్దరు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేయగా, ఒకరిని ఉద్యోగంలోంచి తొలగించారు. ఈ కథనంపై రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి కూడా సీరియస్ అయిన విషయం విదితమే. ఆయన ఆదేశాల మేరకు మొదటి రోజు డీఎంఅండ్ హెచ్‌వో, మెడికల్ కళాశాల డైరెక్టర్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఘటనపై విచారణ చేశారు. రెండో రోజు రాష్ట్ర మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రీషియన్ విభాగం జాయింట్ డైరెక్టర్ రాజేశం కూడా జిల్లాకు వచ్చి సమగ్ర విచారణ చేశారు. ఆయన అందించిన నివేదిక ఆధారంగా కలెక్టర్ విజయేందిర బోయి ఆరుగురిపై వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ నాయక్, పీపీ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ రఫీక్‌లకు షోకాజు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా పీపీ యూనిట్ విభాగంలో పని చేస్తున్న ఒక స్టాఫ్ నర్సు, ఒక ఎఫ్ఎన్‌వో, బండ్లగేరి ప్రాంతానికి చెందిన ఆశ కార్యకర్తను సస్పెండ్ చేశారు. జనరల్ ఆస్పత్రిలో ప్లంబర్‌గా పనిచేస్తున్న ముంతాజ్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించారు.



ధర్నాలో మాట్లాడుతున్న పట్నం నరేందర్ రెడ్డి

గన్నీ బ్యాగులు లేవు

- ధాన్యం కొనుగోలు సరిగా జరగక రైతుల ఇబ్బందులు
- ఇంజనీరింగ్ కళాశాలను కోస్గిలోనే ఉంచాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గన్ని బ్యాగులు లేక, ధాన్యం కొనుగోలు జరగక రైతులు ఇబ్బందిపడుతున్నారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోస్గి శివాజీ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గన్నీ బ్యాగులు లేవని, హమాలీల పేరుతో రైతుల వద్ద కొనుగోలు కేంద్రాల వారు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే రైతులకు గన్ని బ్యాగులు అందించి, ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కోస్గిలో ఏర్పాటు చేస్తానని చెప్పి, హకీంపేటకు తీసుకుపోవడం సరికాదన్నారు. కోస్గిలోనే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. హకీంపేట ఒక్కటే కాకుండా కొడంగల్‌లోని అన్ని మండలాలను అభివృద్ధి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందిపెడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, వెంకట్ నర్సిములు, పోషప్ప, మోహన్, సాయప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళలు ఇంట్లో, బయట హింసకు గురి కాకుండా అన్ని రంగాల్లో ముందు ఉండాలన్నారు. హింసకు గురైన మహిళలల కోసం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కోడేరు విద్యార్థి రాఘవేంద్రను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం



మక్తల్‌లో విద్యార్థి ఆర్‌పీ అజయ్‌ను అభినందిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాములు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తిమ్మాజీపేట విద్యార్థిని నందినితో ఎంఈవో సత్యనారాయణశెట్టి, ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఊట్కూరు విద్యార్థి రమేశ్‌తో తండ్రి, పాఠశాల పీడీ

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

» రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వి. గౌతమ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్/ కోడేరు/ ఊట్కూరు/ మల్దకల్/ మక్తల్/ తిమ్మాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వివిధ క్రీడాంశాలలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని శ్యామగడ్డ తండాకు చెందిన క్రీడాకారుడు వి.గౌతమ్ జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. హరియాణ రాష్ట్రంలోని పానిపట్‌లో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి 35వ సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టులో ఆడనున్నాడు. ఈ సందర్భంగా అతడిని మంగళవారం కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, దామోదర్, సభ్యులు బాలరాజ్, నరసింహులు, శ్రీనివాసులు, పాపరాయుడు, రాజవర్ధన్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు అభినందించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న నందిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యింది. త్వరలో నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న పోటీల్లో ఆమె పాల్గొననున్నది. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను ఎంఈవో సత్యనారాయణ శెట్టి, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, భాగ్యలక్ష్మి, శామ్‌సంగ్, జంగయ్య, నవీన్, సిమ్మయ్య, సత్యనారాయణ, పరంధాములు, విద్యా కమిటీ చైర్మన్ నూర్జహాన్ అభినందించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాఘవేంద్ర రాష్ట్ర స్థాయి అండర్ - 14 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అతడు ఇటీవల గద్వాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు వై.సుధారాణి తెలిపారు.

● నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ 9వ తరగతి విద్యార్థి వై. రమేశ్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

● నారాయణపేట జిల్లా, మక్తల్ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థి ఆర్‌పీ అజయ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాములు, కోచ్ రాఘవేంద్ర తెలిపారు. వారితో పాటు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పీడీ సాయినాథ్ అతడిని అభినందించారు.

● వీరందరూ ఈ నెల 26 నుంచి 28 వరకు పెద్దపల్లి జిల్లా, నంది మేడారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు.



ఎల్కూరు విద్యార్థి ఫయాజ్

● జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఫయాజ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ రజినీకాంత్ తెలిపారు. ఉపాధ్యాయులు భరత్‌కుమార్, వెంకట్రాములు, సృజన, వెంకటేశ్, రాకేశ్ తదితరులు అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శారదాబాయి

» ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



రగ్బీ జట్ల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ శారదబాయి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ స్టేడియంలో మంగళవారం అండర్-17, 19 ఉమ్మడి జిల్లా రగ్బీ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్మోహన్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

తెలంగాణ గోల్డ్ కప్‌లో రాణించాలి

» టీసీఏ జోనల్ ఇన్‌చార్జి జీకే ప్రేమ్‌కుమార్

» ఉత్సాహంగా జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



టీసీఏ జిల్లా జట్టుతో జోనల్ ఇన్‌చార్జి జీకే ప్రేమ్‌కుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గోల్డ్ కప్‌లో జిల్లా జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటాలని టీసీఏ జోనల్ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి జీకే ప్రేమ్‌కుమార్ అన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆధ్వర్యంలో వచ్చే నెలలో నిర్వహించనున్న తెలంగాణ గోల్డ్ కప్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని జీకే క్రికెట్ అకాడమీలో ఎంపిక చేశారు. ఈ పోటీలు జిల్లా, జోనల్ స్థాయిలో నిర్వహించనున్నట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల్లో మోతీలాల్, శ్రీరామ్‌రెడ్డి, భాను, వినిత్, నందకిశోర్, అమర్‌నాయక్, ఇమ్రాన్, అభిలాష్, తరుణ్, యశ్వంత్, వంశీకృష్ణ, నితిన్‌నాయక్, ఆనంద్, ఉమేశ్, ఉదయ్, నితిన్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ఫెరోజ్, దినేష్‌యాదవ్, భాను పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఖోఖో టీంకు ఐతోల్ విద్యార్థిని ఎంపిక



యామినిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి

తాడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడూరు మండల పరిధిలోని ఐతోల్ గ్రామానికి చెందిన న్యూవిజన్ పాఠశాలకు చెందిన యామిని జిల్లా స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు న్యూవిజన్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ లక్ష్మారెడ్డి, పీఈటీ రాఘవులుగౌడ్ మంగళవా రం అభినందించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీ ఎఫ్-14 ఖోఖో జట్టుకు యామిని ఎంపికైంది. పీఈటీ రాఘవులుగౌడ్ లు తెలియజేశారు.

గచ్చుబావికి పూర్వవైభవం

» పునరుద్ధరణకు యువకుల సంకల్పం

» 'సేవ్ గచ్చుబావి' పేరుతో శ్రమదానం

» భక్తుల సహకారంతో 14 రోజులుగా పనులు



'సేవ్ గచ్చుబావి'లో భాగంగా శ్రమదానం చేస్తున్న యువకులు, భక్తులు, నాయకులు

కల్వకుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని గచ్చుబావి పూర్వ వైభవం సంతరించుకుంటోంది. కల్వకుర్తి పట్టణంలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు దాదాపు 800 సంవత్సరాల క్రితం నిర్మించినట్లు స్థానికులు చెప్తున్న ఈ కోనేరుకు ఒక వైపు రాతి కట్టడం, మిగిలిన మూడు వైపులా రాతి మెట్లు ఉన్నాయి. అక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించి, గుడి నిర్మించారు. అలాగే భక్తులు బస చేసేందుకు రాతితోనే మండపాలు నిర్మించారు. గతంలో ఈ కోనేరు నుంచే స్థానికులు తాగునీటిని తీసుకెళ్లే వారని, శివాలయంలో నిత్య పూజలు జరిగేవని స్థానికులు చెప్తున్నారు. కాలక్రమంలో కోనేరు నిరాదరణకు గురైంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రతీ ఏడాది వర్షాకాలంలో కోనేరులో నీరు నిలిచి దుర్గంధం దుర్గంధభరితంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని గచ్చు బావి అభివృద్ధికి (ప్రహరీ నిర్మాణం, సుందరీకరణ) 2022లో మునిసిపాలిటీ నుంచి రూ.20 లక్షలు కేటాయించారు. దీంతో బావి చుట్టూ దిమ్మె నిర్మాణం, వైర్ ఫినిషింగ్, ఆలయ ఆవరణలో బండలు వేయడంతో పాటు ఇతర పనులు వేశారు.



గచ్చుబావిలోని శివాలయం

సోషల్ మీడియా పోస్టుతో..

గచ్చుబావి, శివాలయం దుస్థితిపై కల్వకుర్తి పట్టణానికి చెందిన కార్తీక్ వీడియో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీంతో స్థానిక యువకులతో పాటు, భక్తులు, వివిధ పార్టీల నాయకులు స్పందించారు. 'సేవ్ గచ్చుబావి' పేరుతో 14 రోజుల క్రితం పునరుద్ధరణ పనులు చేపట్టారు. కోనేరులోని మురుగు నీటిని బయటకి తోడివేస్తున్నారు. శ్రమదానంతో శివాలయం ఆవరణను శుభ్రం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆలయాన్ని సందర్శించారు. యువకులతో కలిసి శ్రమదానం చేయడంతో పాటు, ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పనులు కొనసాగేందుకు మునిసిపాలిటీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో క్రేన్ల సాయంతో కోనేరులో పూడికతీత పనులు చేపట్టారు. స్థానిక యువకులతో పాటు, భక్తులు, స్థానిక నాయకులు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం శ్రమదానం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో గచ్చుబావితో పాటు, శివాలయం పూర్వవైభవం సంతరించుకుంటాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గచ్చుబావి మారాలని..



శిథిలావస్థకు చేరిన గచ్చుబావి శివాలయం పూర్వవైభవాన్ని సంతరించుకోవాలన్న ఆకాంక్షతో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాను. దీంతో యువకులు, భక్తులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. 'సేవ్ గచ్చుబాయి' పేరుతో శ్రమదానం జరుగుతోంది.

\- కల్వ కార్తీక్

అందరి భాగస్వామ్యంతో..



పురాతన చరిత్ర కలిగిన గచ్చుబాయి కోనేరు, శివాలయం పునరుద్ధరణకు శ్రమదానం కొనసాగుతోంది. పనుల్లో అన్ని వర్గాలు భాగస్వాములు కావడం అభినందనీయం. ఇదే స్ఫూర్తితో పని చేసి పూర్వ వైభవం సంతరించుకునేంత వరకు కలిసి నడుద్దాం.

\- కే.భాస్కర్‌గౌడ్

నిత్య పూజలు జరగాలి



గచ్చుబావిలోని శివాలయంలో నిత్య పూజలు జరగాలి. అందుకోసం యువకులు, నాయకుల శ్రమదానంతో పనులు చేపట్టడం శుభ పరిణామం. గచ్చుబావి శివాలయం పూర్వ వైభవానికి ప్రభుత్వం మరింత చేయూతనందించాలి.

\- రామకృష్ణ

మల్దకల్ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

» హాజరైన మంత్రాలయం పీఠాధిపతి



మల్దకల్‌లో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రాలయం పీఠాధిపతి, అర్చకులు

మల్దకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రంలో స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఉత్సవాలకు మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఆయనకు భక్తులు, ఆలయ చైర్మన్, ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన బ్రహ్మోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఆ తర్వాత స్వామి సన్నిధిలో భక్తులకు అనుగ్రహ ప్రవచనం చేశారు.

స్వామివారికి పల్లకీ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడికి పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఆలయం నుంచి దశమికట్ట వరకు ఊరేగించారు. ఉత్సవాల్లో రెండవ రోజు బుధవారం శ్రీవిద్యాసింధు మాధవ తీర్థ స్వామి, భైరవీ మాతాజీ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు.

(5వ పేజీ తరువాయి)

వారం రోజులుగా ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిష్ట వేశారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఇందిరమ్మ చీరల పంపిణీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీని చేపట్టారు. మంగళవారం షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి పనులు చక్కబెట్టుకున్నారు. ఇక పూర్తిస్థాయిలో ఎన్నికల బరిలోకి దిగడానికి పార్టీలు సిద్ధమవుతున్నాయి.

షెడ్యూల్ ఇలా..

మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడత నామినేషన్లు 27వ తేదీన ప్రారంభమై, 29వ తేదీన స్వీకరణ గడువు ముగుస్తుంది. 30వ తేదీన నామినేషన్ల పరిశీలన చేస్తారు. డిసెంబరు ఒకటో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలు, ఉప సర్పంచు ఎన్నిక పూర్తి చేస్తారు.

మోగిన నగారా

● రెండో విడత నామినేషన్లు 30వ తేదీన ప్రారంభమై.. డిసెంబరు 2వ తేదీన స్వీకరణ గడువు ముగుస్తుంది. 3వ తేదీన నామినేషన్లు పరిశీలిస్తారు. 4వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 6వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 14వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుంది. ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలు, ఉప సర్పంచు ఎన్నిక పూర్తి చేస్తారు.

● మూడో విడత నామినేషన్ల స్వీకరణ డిసెంబరు 3వ తేదీన ప్రారంభమై.. 5వ తేదీన గడువు ముగుస్తుంది. 6వ తేదీన నామినేషన్లు పరిశీలిస్తారు. 7వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 9వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది.

అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 17వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలు, ఉప సర్పంచు ఎన్నిక పూర్తి చేస్తారు.

జిల్లాల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	2,48,222	2,51,349	11	4,99,582
నారాయణపేట	1,94,124	2,02,410	7	3,96,541
వనపర్తి	1,90,068	1,92,223	4	3,82,295
గద్వాల	1,93,627	1,79,831	-	3,73,458
నాగర్‌కర్నూల్	3,23,016	3,24,315	11	6,47,342
మొత్తం	11,49,057	11,50,128	33	22,99,218

ఉమ్మడి జిల్లాలో విడతల వారీగా ఎన్నికలు జరిగే పంచాయతీలు, వార్డుల వివరాలు

జిల్లా	1వ విడత	2వ విడత	3వవిడత
మహబూబ్‌నగర్	139 గ్రామాలు 1188 వార్డులు	151 గ్రామాలు 1334 వార్డులు	133 గ్రామాలు 1152 వార్డులు
గద్వాల	106 గ్రామాలు 974 వార్డులు	74 గ్రామాలు 725 వార్డులు	75 గ్రామాలు 700 వార్డులు
వనపర్తి	87 గ్రామాలు 780 వార్డులు	94 గ్రామాలు 850 వార్డులు	87 గ్రామాలు 806 వార్డులు
నాగర్‌కర్నూల్	151 గ్రామాలు 1326 వార్డులు	151 గ్రామాలు 1412 వార్డులు	158 గ్రామాలు 1364 వార్డులు
నారాయణపేట	67 గ్రామాలు 572 వార్డులు	95 గ్రామాలు 900 వార్డులు	110 గ్రామాలు 994 వార్డులు
మొత్తం	550 గ్రామాలు 4840 వార్డులు	565 గ్రామాలు 5221 వార్డులు	563 గ్రామాలు 5016 వార్డులు

పూలే, అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యం

» బ్లూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్లూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్

జడ్చర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పూలే, అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా బ్లూ ఇండియా పార్టీని స్థాపించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనుల అభివృద్ధికి అధికారమే ఆయుధమన్నారు. స్థానిక ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో బీసీలకు నష్టం వాటిల్లుతోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్‌ల అంశంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శాగంటి రవితేజగౌడ్, కమ్మటభూపాల్, పాపనినాగరాజు, మధు భూంపల్లి, రాకేశ్‌నాయక్, విటల్‌రాథోడ్, అఫ్రోజ్‌ఖాన్, కరుణాకర్ పాల్గొన్నారు.

మా ధాన్యం ఎందుకు కొనరు?

» అధికారులను నిలదీసిన అన్నాసాగర్ రైతులు



ధాన్యం కుప్ప వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

భూత్పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాము తెచ్చిన ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదంటూ మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌కు చెందిన రైతులు అధికారులను నిలదీశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండోల ద్వారా ధాన్యం కొనుగోలు కొనసాగుతోంది. అన్నాసాగర్‌లో మాత్రం జిల్లా కేంద్రంలోని పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు. అలాగే 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు మంగళవారం వరికుప్పల వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పౌరసరాల కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. ధాన్యాన్ని శుభ్రం చేయడం లేదని, చెత్త, చెదారం లేని ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామంటూ అధికారులు రైతులకు నచ్చచెప్పారు. ఆందోళనలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొడుగు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

నేడు పీయూకి రానున్న జస్టిస్ వంగల ఈశ్వరయ్య

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీకి ఈనెల 26న జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ అధ్యక్షుడు, హైకోర్టు తాత్కాలిక మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ వంగల ఈశ్వరయ్య రానున్నారు. లా కళాశాల ఆధ్వర్యంలో, పీయూ అకాడమిక్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించనున్న భారత రాజ్యాంగ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రా లను రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిటింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాలవి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ భూమయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'భువన విజయం'

జడ్చర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల ఉపాధ్యాయులు ప్రదర్శించిన లఘునాటిక 'భువన విజయం' జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. అఖిలభారత సివిల్ సర్వీసెస్, తెలంగాణ సచివాలయ ఉద్యోగ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్చర్లకు చెందిన ప్రభుత్వం ఉపాధ్యాయులు ప్రదర్శించిన భువన విజయం లఘునాటికను ప్రదర్శించారు. నిర్వాహకులు పోటీల ఫలితాలను మంగళవారం వెల్లడించారు. అందులో భువన విజయం లఘునాటికను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారని శ్రీకృష్ణదేవరాయల పాత్రధారి వెంకటరమణాచార్యులు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి

» ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

వడ్డేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, ప్రజాపాలనతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా, శాంతినగర్‌లోని భవానీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచిత గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల కొత్వాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతీ నిరుపేదకు సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం అందుతోందన్నారు. ముస్లిం మహిళలకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, టెలికాం మెంబర్ ఇస్మాయిల్, సిరాజ్, మొయినుద్దీన్, నాయకులు, మండలాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.

క్రైం కార్నర్

వ్యక్తి అనుమానాస్పద మృతి


లక్ష్మణ్ (ఫైల్)

అచ్చంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన నేనావత్ లక్ష్మణ్ (38) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్‌ఐ సద్దాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చందంపేట మండలంలోని బొల్లారం తండాకు చెందిన నేనావత్ లక్ష్మణ్ (38) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఏడాది కాలంగా పట్టణంలోని మారుతీనగర్‌లో నివసిస్తున్నారు. ఉప్పునుంతల మండలంలోని తాడూరులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న భార్య పద్మ మంగళవారం ఉదయం విధులకు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చే సరికి నేనావత్ లక్ష్మణ్ పడక గదిలోని మంచంపై మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ్ మృతిపై అనుమానాలున్నాయని అతడి సోదరుడు నేనావత్ శ్రీరాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, మండల పరిధిలోని అవురాసిపల్లి గ్రామానికి చెందిన వంగ లక్ష్మమ్మ (45) పాముకాటుతో అస్వస్థతకు గురై, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంగ లక్ష్మమ్మ ఈ నెల 11న గ్రామానికి చెందిన సాకలి నారాయణ పొలంలో పని చేస్తుండగా పాము కాటువేసింది. ఆ విషయాన్ని ఆమె గుర్తించలేదు కానీ కాలు వాయడంతో మరుసటి రోజు నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి వెళ్లింది. వైద్యుల సూచన మేరకు 13వ తేదీన హైదరాబాద్‌లోని హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొంది, 19 తేదీన స్వగ్రామానికి చేరుకున్నది. కానీ మరుసటి రోజే అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. సంఘటనపై ఆమె కుమారుడు ప్రశాంత్‌గౌడ్ ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఊట్కూరు మండలంలో మరొకరు..


సాయిలు (ఫైల్)

ఊట్కూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాము కాటు వేసి తీవ్ర అస్వస్థతకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన సాయిలు (36) ఈ నెల 19న పొలంలో పని చేసి, రాత్రి ఇంటికి వచ్చి, భోజనం చేసి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం భార్య సుజాత నిద్ర లేపినా మేల్కొనపోవడంతో వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గత సోమవారం మృతి చెందాడు. సంఘటనపై అతడి భార్య సుజాత మంగళవారం ఊట్కూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, ట్రాక్టర్ ఢీ

- పలువురికి గాయాలు


రెండు భాగాలుగా విడిపోయిన ట్రాక్టర్

మరికల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలోని ఆత్మకూర్ రోడ్డులో మంగళవారం ట్రాక్టర్, కారు ఢీకొన్నాయి. రోడ్డు దాటుతున్న ట్రాక్టర్‌ను ఆత్మకూర్ నుంచి మరికల్ వైపు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ రెండు భాగాలుగా విడిపోయింది. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్


పీఏసీఎస్ గోదాం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొనడంతో విరిగి పక్కనే ఉన్న చెట్టుపై పడిన విద్యుత్ స్తంభం

ఊర్కొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ఢీకొని విరిగిపోయిన విద్యుత్ స్తంభం పక్కనే ఉన్న చెట్టుపై పడటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద మంగళవారం ఈ సంఘటన జరిగింది. మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి ట్రాక్టర్‌లో మొక్కజొన్న నింపుకొని పీఏసీఎస్ గోదాంకు తీసుకొచ్చాడు. ట్రాక్టర్ రివర్స్ తీసుకుంటుండగా, అది విద్యుత్ స్తంభానికి తగిలి విరిగిపోయి, పక్కనే ఉన్న చెట్టుపై పడింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

13 ఏళ్ల బాలికకు 40 ఏళ్ల వ్యక్తితో పెళ్లి

- నిశ్చయించిన ఇరు కుటుంబాల పెద్దలు
- అడ్డుకున్న అధికారులు, సఖి కేంద్రానికి బాలిక


బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేటీదొడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలంలోని ఓ గ్రామంలో 13 ఏళ్ల బాలికకు 40 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. ఈ విషయంపై బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందింది. కౌన్సెలర్ సురేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, ఇతర అధికారులు మంగళవారం గ్రామానికి వెళ్లారు. ఇరు కుటుంబాల సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహంతో నష్టాలు, చట్టపరమైన చర్యలు, భవిష్యత్ తదితర అంశాలపై బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలికతో మాట్లాడగా, తనకు చదువుకోవాలని ఉందని చెప్పింది. దీంతో ఆమెను బాలల సంక్షేమ సంఘం ముందు హాజరుపరిచారు. వారి ఆదేశం మేరకు సఖి కేంద్రానికి పంపించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారి, పోలీస్ కానిస్టేబుల్ రామస్వామి, చైల్డ్‌లైన్ సిబ్బంది కళావతి పాల్గొన్నారు.

పాడి.. సిరుల సవ్వడి


రైతు వెంకటయ్య పొలంలో పాడి ఆవులు



- పాడి పశువుల పెంపకంపై యువత ఆసక్తి
- విజయ డెయిరీ ద్వారా ప్రతీ రోజు 65 వేల లీటర్ల పాల సేకరణ
- బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు
- నేడు జాతీయ పాల దినోత్సవం

వెల్దండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విత్తనాల కొనుగోలు మొదలుకొని, దిగుబడులను మార్కెట్లో విక్రయించే వరకు కష్టాలు పడుతున్న రైతులను పాడి పరిశ్రమ అండగా నిలుస్తోంది. వ్యవసాయ అనుబంధరంగమైన పాడి పరిశ్రమ వైపు రైతులు, ప్రధానంగా యువకులు ఆసక్తి చూపుతున్నారు. అధిక పాల దిగుబడులు ఇచ్చే సంకరజాతి ఆవులు, గేదెలను పెంచుతున్నారు. అందుకోసం పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి హెచ్ఎఫ్, జెర్సీ ఆవులను లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అలాగే హరియాణా, గుజరాత్ రాష్ట్రాల నుంచి ముర్రా, గ్రేడెడ్ ముర్రా, బన్నీ, జాఫ్రబాదీ గేదెలను కొనుగోలు చేస్తున్నారు. తమ పొలాల్లోనే ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేసుకొని వీటిని పోషిస్తున్నారు. పశుగ్రాసం కోసం కో4, నేపియర్ తదితర దీర్ఘకాలిక పశుగ్రాసాలను పెంచుతున్నారు. వీటి నిర్వహణకు కొందరు రైతులు బిహార్‌కు చెందిన వారిని పనిలో పెట్టుకుంటున్నారు.

పాల సేకరణలో 2వ స్థానం

ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయా డెయిరీ పాల సేకరణలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. విజయా డెయిరీ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో 215 పాల సేకరణ కేంద్రాలున్నాయి. వాటి ద్వారా ప్రతీ రోజు 9 వేల మందికి పైగా రైతుల నుంచి దాదాపు 65 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. అందుకోసం వెల్దండ, కుప్పగండ్ల, ఊర్కొండ, గుండూరు, కొండారెడ్డిపల్లి, నాగర్‌కర్నూల్, మాదారం గ్రామాలలో బల్క్ మిల్క్ సెంటర్ (బీఎంసీ) కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని చాలా గ్రామాల్లో తిరుమల, హడ్సన్, మస్కతీ, జెర్సీ, దొడ్ల తదితర ప్రైవేటు డెయిరీలు కూడా ప్రతీ రోజు 40 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

విజయా డెయిరీ ద్వారా సేకరిస్తున్న పాలకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో వెన్న శాతం ఆధారంగా ఆవు పాలు లీటరుకు రూ. 40 వరకు ఇచ్చేవారు. కానీ ఆ ధరను రూ. 4 వరకు తగ్గించారని రైతులు చెప్తున్నారు. అలాగే పాల బిల్లులు కూడా తరుచూ పెండింగ్‌లో ఉంటున్నాయని అంటున్నారు. గతంలో ప్రోత్సాహకంగా లీటరుకు 4 రూపాయలు అదనంగా ఇచ్చేవారని, 2020 నుంచి అది కూడా ఇవ్వడం లేదని చెప్తున్నారు. విజయాడెయిరీ అధికారుల గణాంకాల ప్రకారం దాదాపు రూ. 7 కోట్లు రెగ్యులర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రోత్సాహకానికి సంబంధించి రూ. 35 కోట్ల నుంచి 40 కోట్ల వరకు బకాయిలున్నాయి. సకాలంలో బిల్లులు రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రుణాలు అందించేలా చూస్తాం



పాడిరైతులు ఆర్థికంగా ఎదగడమే విజయా డెయిరీ ప్రధాన ధ్యేయం. పెండింగ్ బిల్లులు త్వరలోనే ఇస్తాం. ఆసక్తి ఉన్న రైతులకు బ్యాంకర్లతో మాట్లాడి గేదెల కొనుగోలుకు రుణాలు అందించేలా చూస్తాం. రైతులు అధైర్యపడాల్సిన పనిలేదు. పాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. పాడి పరిశ్రమ నిర్వహణకు యువత ముందుకు రావాలి

- సత్యనారాయణ యాదవ్, విజయా డెయిరీ, పాడిపరిశ్రమ అభివృద్ధి జిల్లా ఉపసంచాలకులు

కుటుంబపోషణ సాగుతోంది



గతంలో వ్యవసాయంలో తీవ్ర నష్టాన్ని చవి చూశాను. దీంతో కొన్నేళ్ల క్రితం పాడి ఆవులను కొనుగోలు చేసి, డెయిరీ నిర్వహిస్తున్నాను. కుటుంబ సభ్యుల సహకారంతో క్రమంగా ఆవుల సంఖ్యను పెంచాను. ప్రస్తుతం ప్రతీ రోజు దాదాపు 130 లీటర్ల పాలు విక్రయిస్తున్నాను.

- మట్ట వెంకటయ్యగౌడ్, రైతు, వెల్దండ

గేదె పాలకు డిమాండ్



ప్రస్తుతం మార్కెట్‌లో గేదె పాలకు డిమాండ్ ఉంది. ఇటీవల గుజరాత్ నుంచి బన్నీజాతి గేదెలను తీసుకొచ్చాను. ప్రతీ రోజు వచ్చే పాలను ఇళ్లకు, హోటళ్లకు పోసి ఉపాధి పొందుతున్నాను. ప్రభుత్వం స్పందించి పాడి రైతులను రుణాలు ఇవ్వాలి.

- కుర్మిద్ద శ్రీశైలం, రైతు, వెల్దండ

రూ. 15 లక్షల సుపారీ?

- మాజీ సర్పంచ్ హత్య కేసులో కీలక మలుపులు
- వెలుగు చూస్తున్న సంచలన విషయాలు


మాజీ సర్పంచ్ చిన్నభీమరాయుడు(ఫైల్)

గద్వాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలంలోని నందిన్నె మాజీ సర్పంచు చిన్న భీమరాయుడి హత్య కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అతడి హత్యకు ఆరు నెలలుగా రెక్కీ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఓ మిల్లు యజమాని గతంలో జరిగిన మరో రెండు హత్య కేసుల్లోనూ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆత్మరక్షణ కోసం అతడు తన వాహనంలో ఒక కత్తిని ఎల్లప్పుడూ ఉంచుకునే వాడని సమాచారం.

అక్రమాలకు అడ్డొస్తున్నాడనే...

తమ అక్రమ వ్యాపారాలకు అడ్డొస్తున్నాడనే కోపంతో భీమరాయుడిని చంపేందుకు సదరు మిల్లు యజమాని రాయలసీమకు చెందిన సుపారీ గ్యాంగ్‌తో రూ. 15 లక్షలకు బేరం కుదుర్చుకున్నట్లు తెలిసింది. సంఘటనకు ఒక రోజు ముందే రూ. 3 లక్షలు చేతులు మారినట్లు సమాచారం. అయితే తనకు ప్రాణహాని ఉందని చిన్నభీమరాయుడు ముందే అనుమానించాడు. ఈ విషయంపైనే సంఘటన జరిగిన రోజు సాయంత్రం వరకు అతడు పోలీసుల వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఒంటరిగా బైక్‌పై వెళ్తుండగా, ప్రత్యర్థులు వెంబడించి వాహనంతో ఢీకొట్టి మట్టుపెట్టారు. ఈ ఘటనలో పోలీసులు ఇప్పటివరకు 10 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

అన్ని కోణాలలో దర్యాప్తు



మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు అనుమానాస్పద మృతిపై అన్ని కోణాలలో దర్యాప్తు ముమ్మరం చేసాం. ఈ కేసుతో పాటు ప్రధాన నిందితులకు సంబంధం ఉన్న ఇతర హత్య కేసులపై కూడా విచారిస్తున్నాం. పూర్తి వివరాలను తెలుసుకొని పూర్తి వివరాలను వెల్లడిస్తాం.

- మొగులయ్య, డీఎస్పీ

మాట తప్పిన కాంగ్రెస్

- బీసీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ నారమోని నరేశ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ నారామోని నరేశ్

అచ్చంపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని బీసీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ నారమోని నరేశ్ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ మేరకు రిజర్వేషన్లు ఇవ్వకపోగా ఇంతకు ముందున్న 23 శాతం కంటే తక్కువగా ఇవ్వడం దారుణమన్నారు. జిల్లాలో 460 సర్పంచ్ స్థానాలకు గాను కేవలం బీసీలకు 61 స్థానాలు కేటాయిచడం జరిగిందన్నారు. 23శాతం ఇచ్చినా, 150కి పైగా స్థానాల్లో బీసీలకు అవకాశం వస్తుందన్నారు. ఏవిధంగా బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చారో ప్రభుత్వం చెప్పాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు అజయ్, వెంకటేష్, శివశంకర్, శ్రీశైలం, అరవింద్ చారి పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీ

కోడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరం ఈజీఎస్ పనులు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జిల్లా అధికారులు పాల్గొని సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ టీఎస్ మొత్తం పనులు 426 చేసినట్లు అందుకు మూడు కోట్ల 26 లక్షలు ఖర్చు అయ్యాయని అన్నారు. అందుకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన పనుల గురించి, ఖర్చు వివరాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలు అడిషనల్ డీఆర్డీఏ అధికారి రాజేశ్వరి, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, పీఆర్‌ఏఈ మోహన్, ఏపీడీ శ్రీనివాస్, ఎస్ఆర్పీ రంజిత్‌కుమార్, ఏపీవో నాగరాజు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌సీలు, టీఏలు, ఎఫ్ఏలు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికను తీసుకెళ్లిన వ్యక్తి

- పోలీసులకు ఫిర్యాదు

గండీడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే ఊరికి చెందిన గంటల శ్రీశైలం అనే వ్యక్తి ఇంటి నుంచి తీసుకెళ్లాడు. ఈ విషయంపై బాలిక కుటుంబ సభ్యులు మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అత్తను కొట్టిన అల్లుడు

- కేసు నమోదు చేసిన పోలీసులు

గండీడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అత్తపై దాడి చేసి కొట్టిన అల్లుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన జయమ్మ ఇంటికి అల్లుడు బొక్క శివ మంగళవారం వచ్చి గొడవ పెట్టుకున్నాడు. ఆమెపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఎక్కడ?

- పీయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నాగం కుమార స్వామి


ధర్నాలో మాట్లాడుతున్న పీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నాగం కుమారస్వామి

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ ఏమయ్యిందని పీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నాగం కుమార స్వామి ప్రశ్నించారు. పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 9 అని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అన్న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46 ప్రకారం, 28 శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించడం ఏమిటని నిలదీశారు. బహుజనులకు రాజ్యాధికారం అందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరిగినట్లను చెప్పారు. వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రాజ్యాధికార దిశగా పోరాటాలు చేయాలని కోరారు. బీసీ సంఘాల నాయకులు, అధ్యాపకులు రవీందర్‌గౌడ్, విద్యార్థి నాయకుడు తాయప్ప పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లతో కట్టు బానిసత్వం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టుబా నిసత్వంలోకి నెట్టేస్తాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ విమర్శించారు. పట్టణంలోని అభినందన్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం జిల్లా ద్వితీయ మహాసభకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన లేబర్ కోడ్‌లతో కార్మికులు మరింత శ్రమదోపిడీకి గురవుతారని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్లకు నిజమైన మిత్రుడని దుయ్యబట్టారు.

కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసి, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గోవిందరాజు, బి.బాల్‌రామ్ ఎన్నికయ్యారు.

డ్రైవర్, కండెక్టర్ ఆర్టీసీకి వెన్నెముక

- టీజీఎస్ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్


నాగర్‌కర్నూల్‌లో ఆర్టీసీ ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేస్తున్న జిల్లా ఫారెస్టు అధికారి రోహిత్ గోపిడి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు డ్రైవరు, కండక్టరు ఇద్దరు వెన్నెముక లాంటి వారని టీజీఎస్ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజరు సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా ఫారెస్టు అధికారి రోహిత్ గోపిడి హాజరై పలువురు ఉద్యోగులు, సిబ్బందికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్ ఉద్యోగం చాలా బాధ్యత, విలువైనదన్నారు. డిప్యూటీ ఆర్ఎంవోలు లక్ష్మి, కవిత, డిపో మేనేజరు యాదయ్య, అసిస్టెంట్ మేనేజరు జోగమ్మ, టీపీ బాల్‌రెడ్డి, ఏడీసీలు పరశురాం, శ్రీనివాస్, ప్రకాశ్, సిబ్బంది వీఎస్.ఆరాయణ, ఏసీరెడ్డి, పెంటయ్య, అశోక్‌రెడ్డి, డీఎస్.నారాయణ, సత్యం, రవికుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వరి కొయ్యలను కలియదున్నాలి

● మండల వ్యవసాయాధికారి రహమాన్



మరికల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు వరి కొయ్యలు కాల్చకుండా కలియ దున్నాలని మరికల్ మండల వ్యవయాసాయాధికారి రహమాన్ తెలిపారు. వరి కొయ్యలను కలియ దున్నితే అవి ఎరువుగా ఉపయోగపడతాయని మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

వరి కొయ్యలు కలియదున్నితే ప్రయోజనాలు ఏమిటి?

వరి కొయ్యలను భూమిలోనే కలియ దున్నితే మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది. మేలు చేసే బ్యాక్టీరియా, సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.

వరి కొయ్యలు కాల్చితే నష్టం ఏంటి?

భూసారం దెబ్బతిని భూమి తేమను నిలుపుకునే సహజ గుణాన్ని కోల్పోతుంది. నేలలో సహజంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి. నత్రజని పోషక పదార్థాలు క్షీణించి సాగుకు పనికి రాకుండా పోతుంది.

రైతులకు ఏమైనా సూచనలు చేస్తారా?

పంట కొయ్యలను కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలి. ప్రభుత్వం ప్రతీ మంగళవారం చేపడుతున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

సబ్సిడీపై ఏమైనా పనిముట్లు అందిస్తున్నారా?

ప్రస్తుతం ఏమీ లేవు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు దరఖాస్తులు తీసుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

జిల్లాలో సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు

నారాయణపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో 272 సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పరిశీలిస్తే అన్‌రిజర్వ్‌డ్(జనరల్) కేటగిరీలో మహిళలకు 59 స్థానాలు రిజర్వ్ కాగా, 66 స్థానాలు జనరల్ కేటగిరీగా ఉన్నాయి. బీసీకి రిజర్వ్ అయిన స్థానాల్లో 33 స్థానాలు మహిళలకు రిజర్వ్ కాగా 39 స్థానాలు జనరల్ కేటగిరీగా ఉన్నాయి. ఎస్సీకి రిజర్వ్ అయిన స్థానాల్లో 17 మహిళలకు రిజర్వ్ కాగా 26 జనరల్‌గా ఉన్నాయి. ఎస్టీకి రిజర్వ్ అయిన స్థానాల్లో 3 స్థానాలు మహిళలకు రిజర్వ్ కాగా జనరల్ కేటగిరీగా ఒక స్థానం ఉంది.

ధాన్యం నిల్వల తరలింపు కోసం క్రయవిక్రయాల నిలుపుదల

నారాయణపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ధాన్యం క్రయవిక్రయాలు నిలిచాయి. యార్డులో 20 వేలకు పైగా ధాన్యం బస్తాలు పేరుకుపోవడంతో వ్యాపారులు క్రయవిక్రయాలను నిలిపివేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వ్యాపారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, బుధవారం ధాన్యం కొనుగోళ్లు యదావిధిగా కొనసాగుతాయని సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

రేపు మధుమేహ, చిన్నపిల్లల వైద్య శిబిరం

నారాయణపేటరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాసన్‌పల్లి గ్రామంలో గురువారం వైద్య నిపుణులు గందె సునిధి, కార్తీక్ దంపతుల పర్యవేక్షణలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో మధుమేహ, చిన్నపిల్లల మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు సరిత, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ హరినారాయణబట్టడ్, గందె ఉమాకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పోషకాహారాలతో రక్తహీనతను నివారించవచ్చు

దామరగిద్ద, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి పి.నారాయణ సూచించారు. మంగళవారం దామరగిద్ద కేజీబీవీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు రక్తహీనత వలన కలిగే నష్టాలు, పోషకాహారం యొక్క అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. వైద్యాధికారి పి.నారాయణ, ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు వెంకటేష్, కిష్టమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

నారాయణపేటరూరల్/నర్వ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏరిస్ కంపెనీ 56వ వార్షికోత్సవం సందర్భంగా పేట మండలం అప్పక్‌పల్లి గ్రామంతో పాటు, నర్వ మండలం రాయికోడ్ గ్రామాల్లో కంపెనీ ప్రతినిధులు పంటల సాగుకు సంబంధించి రైతులకు మంగళవారం పలు సూచనలు చేశారు. అనంతరం ఆయాచోట్ల రైతుల పేర్లను లక్కీడిప్ తీసి విజేతలకు బ్యాటరీ స్ప్రేయర్‌ను అందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పవన్‌యాదవ్, నరేష్‌రెడ్డి, సుధాకర్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

» ఆస్పత్రిలో సౌకర్యాలు లేక వైద్యుల అవస్థ
» వర్షం వస్తే మందుల నిల్వకు ఇబ్బంది
» ఉప కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి



మరికల్‌లో శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల

మరికల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ, వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలు, ఆవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న పాలకులు వాటి సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల కేంద్రంలో పశువైద్యశాల భవనం, పరిధిలోని ఉపకేంద్రాలు పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా, మరికల్‌లోని పశువైద్యశాల, ఎల్లిగండ్ల, కన్మనూర్ గ్రామాల్లోని ఉప కేంద్రాల నుంచి రైతులకు పశువైద్య సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన పశువైద్యశాల భవనం గోడలు నెర్రలు బారి ఏ క్షణంలో కూలిపోతుందోననే భయంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. ఆసుపత్రి భవనం పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాకాలంలో ఆసుపత్రిలోకి నీరు చేరుతోంది. దీంతో పశువులకు కావల్సిన మందులు నిల్వ ఉంచుకోవడానికి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మందులను ఎక్కడ పెట్టాలో తెలియక డాక్టర్ సతమతమవుతున్నారు. మరోవైపు పశువైద్యశాల ప్రాంగణం చెరువును తలపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన భవనానికి నిధులు మంజూరు చేసి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..



మండలంలో పశువైద్యశాల నూతన భవన నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిధులు మంజూరు కాగానే నూతన భవనం చేపడుతాం.

- డాక్టర్ మహదేవ్, మండల పశువైద్యాధికారి

ఇన్సూరెన్స్ అనుమతులు రద్దు చేయాలి

» కలెక్టరేట్ ముందు టీయూసీఐ ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన ఇన్సూరెన్స్ అనుమతులను రద్దు చేయాలని టీయూసీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ చౌరస్తా నుంచి నాయకులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మునిసిపల్ పార్కు వద్ద ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ల వల్ల భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణాలకు, శాశ్వత, పాక్షిక అంగవైకల్య పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.12ను 2025 జూలై 22న విడుదల చేసిందన్నారు. జీవోకు నిరసనగా ర్యాలీ, ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే నెల 5న హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించి, కార్మికులకు మద్దతుగా నిలుస్తామని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ అమరేందర్‌కృష్ణకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా నాయకులు బి.నరసింహా, ఎస్.కిరణ్, హజీమలంగ్, వెంకటయ్య, నగేష్, తిమ్మయ్య, అశోక్, దేవప్ప, నరేష్, వెంకటప్ప, శంకర్, కతలప్ప, హనుమాన్‌దాస్, రాజు, మహేష్, అశోక్, శరణప్ప, నరేష్, హన్మంతు తదితరులున్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కట్ట సురేష్‌కుమార్‌గుప్తా

మక్తల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, కట్టసురేష్ కుమార్‌గుప్తా అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి 150 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, మక్తల్, నారాయణపేట నాలుగు లైన్ల రోడ్‌లతో పాటు సంగంబండ లోలెవల్ పనులు పూర్తి చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే తట్టుకోలేకపోతున్నారన్నారు. చిట్టెం 18 ఏళ్ల ఎమ్మెల్యేగా పనిచేసి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. సంగంబండ, భూత్పూర్, జూరాల ముంపు గ్రామాల ప్రజలకు ఏ ఒక్కనాడు ఒక్క పని చేయలేదని విమర్శించారు. ఇసుక మాఫియా, ఒండ్రుమట్టితో ఎన్ని కోట్లు గడించావో చెప్పాలన్నారు. మిషన్ కాకతీయ కింద ప్రతీ ఎమ్మెల్యే కోట్ల రూపాయలు తీసుకువస్తే ఇక్కడ మాత్రం మొక్కుబడి నిధులు తెచ్చారన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడైనా చర్చకు సిద్ధమే అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మ్యాదరి శ్రీనివాసులు, కల్లూరి గోవర్దన్, భాస్కర్, ఫయాజ్, చెన్నయ్యగౌడ్ ఉన్నారు.

మట్టి తవ్వకాల స్థలం పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లారెడ్డి

నర్వ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉందెకోడ్ గ్రామంలోని సర్వే నెంబర్ 202లో ఉన్న పదెకరాల ప్రభుత్వ భూమి గుట్టలో మట్టి తవ్వకాలు చేపట్టిన స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ మల్లారెడ్డి పరిశీలించారు. కొంతకాలంగా ఇక్కడ రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఓ బిల్డర్ ఎక్స్‌కవేటర్, ఇతరత్రా యంత్రాల సహాయంతో ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతున్నాడు. గమనించిన గ్రామస్థులు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారమివ్వడంతో వారు రాగానే తవ్వకాలు చేస్తున్న వ్యక్తులు పరారయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ఆ గుట్టపై కమ్యూనిటీ పల్లెప్రకృతి కింద 4వేల మొక్కలు ఏర్పాటు చేశారు. ఆ మొక్కలను తొలగించి మట్టిని తరలిస్తున్నారు. మంగళవారం తహసీల్దార్ మల్లారెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఆయన గుట్టను పరిశీలించారు. భూమిని సర్వే చేసి మట్టిని అమ్ముకున్న వ్యక్తులపై, భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజానాట్య మండలి మహాసభలను జయప్రదం చేయాలి

దామరగిద్ద, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జానపద కళలు, ప్రజా సాంస్కృతిక కళలను కాపాడుకునేందుకు జిల్లాలోని కళాకారులు కలిసి రావాలని ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు బీంపురం హనుమంతు, ఆశన్‌పల్లి హనుమంతులు తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రజా నాట్యమండలి జిల్లా మహాసభల కరపత్రాలను మంగళవారం వారు ఆశన్‌పల్లి గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాలను విస్తృత పరిచేందుకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆటపాటలను అందించేందుకు ప్రజానాట్యమండలి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు ఎం.హనుమంతు, బీంపురం హనుమంతు, వెంకటేష్, బీమేష్, పి.అంజి, బి.కృష్ణ తదితరులు ఉన్నారు.

కరాటేలో మక్తల్ విద్యార్థుల ప్రతిభ

మక్తల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ జిల్లాలో జరిగిన కరాటే పోటీల్లో డ్రాగన్ చోటోఖాన్ దూస్పోర్ట్స్ మక్తల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే వ్యవస్థాపకుడు శాలంబిన్ ఉమర్, ఎగ్జామినర్ అంబ్రేష్ తెలిపారు. విద్యార్థులు కుమితె, కథామిలో మాయ, దీక్షిత, సోహెల్, నిక్షిత, హుసేన్, తేజశ్రీ, జైన్, వర్షిత్, రవీంద్ర, మంజుల, రాజులు వెండి, కాంస్య పతకాలు సాధించారన్నారు. గతంలో కూడా మక్తల్ విద్యార్థులు అనేక టోర్నమెంట్స్‌లో పాల్గొని వెండి పతకాలు సాధించారన్నారు. ఉపాధ్యక్షుడు అంజన్‌ప్రసాద్, రేడియంట్ ప్రిన్సిపాల్ బాల్‌రాజ్‌రెడ్డి, మాస్టర్ సలీం, నాగేశ్వరి, హర్షధరణి, ధనుష్, చేతన్, విఘ్నేష్ పాల్గొన్నారు.

పంతం నెగ్గించుకున్న మంత్రి

మక్తల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, మక్తల్ కొడంగల్ ఎత్తిపోతల పథకంలో మక్తల్ మండలంలోని భూత్పూర్ జలాశయం వద్ద త్వరగా పనులు ప్రారంభించారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డికి మక్తల్, పేట, కొడంగల్ ఎత్తిపోతలుగా మార్చాలని మంత్రి వాకిటి శ్రీహరి పంతం పట్టారు. దీంతో కొడంగల్ ఎత్తిపోతల పథకానికి పేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతలుగా మార్చుతూ జీవో జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నారాయణపేట పట్టణానికి చెందిన కమలాపూర్ సదానందంకు రూ.15 వేలు, దావాల్జికి రూ.5 వేలు, ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మికి రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఎంపీ డీకే అరుణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, బీజేపీ నాయకులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించాలి

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు, పార్కింగ్ సమస్యలతో పాటు రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల కొమ్మలు వెంటనే తొలగించాలని ఆర్టీఏ మెంబర్ పి.రాజేష్ మునిసిపల్ కమిషనర్ నరసయ్యకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. అలాగే ప్రధాన కూడళ్లలో, మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, చౌరస్తాలో ఉన్న ఇనుప రాడ్లను తొలగించాలని ఏఎస్పీకి వినతపత్రం అందించారు. కాంగ్రెస్ నాయకులు సీతారాంరెడ్డి, వాజిద్ ఉన్నారు.

బ్యాంకు ఏటీఎం కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి



ఏటీఎం కేంద్రం వద్ద కస్టమర్‌కు సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్ఐలు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కస్టమర్లు బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద లావాదేవీలు జరిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలను సీఐ, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద ఉన్న కస్టమర్లకు, బ్యాంకు అధికారులకు సూచనలు చేశారు.

ఈనెల 30న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఎంపికలు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 30న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఎంపికలు ఉంటాయని అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 4న రంగారెడ్డి జిల్లాలో రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు ఉంటాయన్నారు.

గణేశ్ నిమజ్జనం అల్లర్ల కేసును కొట్టివేసిన జిల్లా కోర్టు

ఊట్కూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 2017వ సంవత్సరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఊట్కూర్‌లో జరిగిన ఇరువర్గాల అల్లర్లలో ఇరువైపులా కేసులు నమోదు అయ్యాయి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులను కొందరు కులం పేరుతో దూషించారనే ఆరోపణతో 26 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. కేసు విచారణలో ఉండగానే అందులో ఉన్న ఇద్దరు మృతి చెందడంతో మిగిలిన 24 మందిపై కోర్టులో విచారణ జరుగుతున్నది. కేసు చివరి దశలో వాదోపవాదాలు విన్న ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ఎలాంటి బలమైన ఆధారాలు సమర్పించకపోవడంతో పోలీసులు పెట్టిన కేసును కొట్టి వేసింది.

మహిళా సంఘాల ఖాతాల్లోకి నిధులు

» పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న సదాశివారెడ్డి

నారాయణపేట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించే కార్యక్రమంలో భాగంగా పేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు రూ.కోటి 79 లక్షల 217లను 2,136 మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డీఆర్డీవో మొగులప్పలతో కలిసి రూ.1,79,00217ల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సలహాదారు మాధవరెడ్డి, డీపీఎం మాసన్న, జిల్లా మహిళా సంఘాల ప్రతినిధులు అరుందతి, సుజాత, ఏపీఎంలు నారాయణ, అంజిలయ్య, వెంకటచారి, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

యాసంగి విత్తనాలు పంపిణీ

పేట మండలం జాజాపూర్ గ్రామంలోని రైతువేదికలో మంగళవారం రైతులకు యాసంగి వరి విత్తనాలను మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, డీఏవో జాన్ సుధాకర్ పంపిణీ చేశారు. ఏవో దినకర్, మాధవరెడ్డి, పోషల్ రాజేష్, ఏఈవోలు రాజేష్, అనిల్, అంజమ్మ, సుధాకర్, కోట్ల మధుసూదన్‌రెడ్డి, శరణప్ప, నీలి వెంకటేశ్, అలుగడ్డ రవి, రాములు, తిరుమలప్ప తదితరులున్నారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

» ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాల్లో నాయకులు



మరికల్ మండలం తీలేరు గ్రామంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మరికల్/నారాయణపేట రూరల్/కోస్గి రూరల్/ఊట్కూర్/మక్తల్ రూరల్/కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మరికల్ మండలం తీలేరు గ్రామంలో ఆయన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి రాజు, వెంకట్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రాంచెంద్రి తదితరులున్నారు.

అదేవిధంగా, నారాయణపేట మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మంగళవారం మహిళా శక్తి ఇందిరమ్మ చీరలను పేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.సదాశివారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, ఎమ్మెల్యే వ్యక్తిగత సలహాదారుడు మాధవరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శరణప్ప, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోస్గి ఉమ్మడి మండల పరిధిలోని మీర్జాపూర్, సర్జఖాన్‌పేట్, ముశ్రీఫా, నాచారం, కడంపల్లి, గుండుమాల్, వీరారం, కొమ్మూర్, బోగారం గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ మంగళవారం ఇందిరమ్మ చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు.

ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల, ఓబ్లాపూర్, బిజ్వార్, పగిడిమారి గ్రామాల్లోని రైతువేదికల వద్ద ఆయా గ్రామాల నాయకులు జి.ప్రశాంత్, రవికుమార్‌రెడ్డి, బందేనవాజ్, నాగేష్‌గౌడ్ చీరలను పంపిణీ చేశారు.

మక్తల్ మండలంలోని భూత్పూర్, కొండదొడ్డి, గుడిగండ్ల, మంతన్‌గోడ్, పసుపుల, జక్లేర్ తదితర గ్రామాల్లో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కాగా, మంగళవారం సాయంత్రం పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో చీరల పంపిణీ కార్యక్రమానికి బ్రేక్ పడనున్నట్లు సమాచారం.

కొత్తపల్లి మండలంలోని భూనీడు, గోర్లొనిబాయి, కిషన్‌నగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల మహేందర్‌రెడ్డి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. నాయకులు సవారి శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్ తదితరులున్నారు.

రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ



ఊట్కూర్ రైతువేదికలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి

ఊట్కూర్/మాగనూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఊట్కూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా వచ్చిన సబ్సిడీ విత్తనాలను ఏవో గణేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు మణెమ్మ, సూర్యప్రకాష్‌రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వమని అన్నారు. రైతులకు 13 క్వింటాళ్ల విత్తనాలు అందించినట్లు తెలిపారు. ఏఈవో స్వరూపరాణి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్‌రెడ్డి, నాయకులు వై.జనార్దన్‌రెడ్డి, కే.శంకర్, మోహన్‌రెడ్డి, శివరామరాజు, ఖుర్షీద్‌మియ్య, గోవిందప్ప, గోపాల్ రెడ్డి, జమీర్‌అలీ, రవికుమార్ పాల్గొన్నారు.

అదేవిధంగా, మాగనూరు రైతువేదికలో రైతులకు 40 శాతం సబ్సిడీలపై వరి ఆర్ఎన్ఆర్-15048 రకం విత్తనాలను ఏడీ నగేష్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ విత్తనాలు తీసుకున్న రైతులు దుక్కి దున్ని మొలక చల్లాలన్నారు. మొలకెత్తిన తర్వాత 30 రోజుల్లోగా నాటు, తరువాత ఎకరాకు సంచి నగం ఎరువులను వేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సుదర్శన్‌గౌడ్, ఏఈవోలు పవన్, అపర్ణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆనంద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డి.ఆనంద్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మీడియా వర్సెస్ పోలీస్ క్రికెట్ మ్యాచ్



క్రికెట్ ఆడుతున్న ఎస్పీ డా.వినీత్

నారాయణపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీలో భాగంగా మంగళవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో మీడియా వర్సెస్ పోలీస్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా కొనసాగింది. ఎస్పీ డా.వినీత్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించి కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ మ్యాచ్‌లు పరస్పర అర్థం చేసుకునే స్వభావాన్ని టీమ్ స్పిరిట్‌ను మరింత పెంచుతాయని అన్నారు. టాస్ గెలిచిన మీడియా జట్టు నిర్ణీత 8 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేశారు. అనంతరం పోలీసు జట్టు 6 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను అభినందించారు. అదనపు ఎస్పీ ఎండీ.రియాజ్ హుల్‌హక్, సీఐ శివశంకర్, డీపీఆర్‌వో రషీద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్‌ఖలీల్, ఆర్ఎస్ఐ నరసింహ, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, శివశంకర్, జర్నలిస్టులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగా జలం అందజేత

మక్తల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలో ఈనెల 30న జరగనున్న పడమటి ఆంజనేయస్వామి కోనేరు ప్రారంభోత్సవం పూజా కార్యక్రమానికి అయోధ్యలోని సరయూ నది నుంచి తీసుకొచ్చిన గంగానది పవిత్ర జలాలను వీహెచ్‌పీ జిల్లా గౌరవ అధ్యక్షుడు భీంరెడ్డి మంగళవారం ఆలయ ధర్మకర్త ప్రాణేషాచారికి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన 50వ పుట్టినరోజు సందర్భంగా అయోధ్య, కాశీయాత్రకు వెళ్లానని, అక్కడి ఆలయాల్లో పూజలు చేసి గంగానది జలాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. పట్టణంలో అతి పురాతనమైన కోనేరును పునరుద్ధరించి చరిత్రలో భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్న తరుణంలో పవిత్ర నదుల జలాలు తీసుకొచ్చి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బజరంగదళ్ నాయకులు పసుల బీమేష్, రవీందర్‌రెడ్డి, విజయ్, నర్సింహ ఉన్నారు.